జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..


జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 28-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 685 పేజీలు: 4 వెల : రూ.7





- ఉత్సాహంగా పసుపు పండుగ
- తరలివచ్చిన టీడీపీ శ్రేణులు
- భారీ స్క్రీన్లపై చంద్రబాబు, లోకేష్ ప్రసంగాలు తిలకించిన కార్యకర్తలు, నాయకులు
- కార్యకర్తల్లో నూతనోత్సాహం
- శ్రీకాకుళం.. పసుపుమయం
- రెపరెపలాడిన టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు

# మహానాడు సంబరం



**శ్రీకాకుళం, మే 27 (వార్త):** తెలుగుదేశం పార్టీ మహానాడు వేడుకలు శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ, మండల కేంద్రాలు, ఇతర ప్రధాన గ్రామాల్లో క్లస్టర్ల వారీగా ఏర్పాటు చేసిన వేదికలు తెలుగుతమ్ముళ్లతో కిటకిటలాడాయి. ఎటు చూసినా పార్టీ జెండాలు రెపరెపలాడాయి. జిల్లాస్థాయి నేత నుంచి గ్రామ కార్యకర్త వరకు శ్రేణులంతా ఉత్సాహంగా మహానాడులో పాల్గొన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమైన మహానాడు వేడుకలు సాయంత్రం ఐదు వరకూ సాగింది. తొలుత పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహం వద్ద నివాళులర్పించారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో 73 క్లస్టర్లలో మహానాడు వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ఆమదాలవలసలో ఎమ్మెల్యే కూన రవికుమార్, పాతపట్నంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, శ్రీకాకుళంలో గొండు శంకర్, పలాసలో గౌతు శిరీష, నరసన్నపేటలో బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో జరగ్గా, మిగతా ప్రాంతాల్లో పార్టీ పరిశీలకులు ఆధ్వర్యంలో వర్చువల్‌లో మహానాడు నిర్వహించారు. అలాగే మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి హైబ్రిడ్ విధానంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, కార్యకర్తలు వర్చువల్‌గా పాల్గొన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్, ఇతర నేతల ప్రసంగాలను విన్నారు. మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో కె.రామ్మోహన్ నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు కె.అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# భగభగ



**మందస, మే 27 (వార్త):** రోజురోజుకూ పెరుగుతున్న తీవ్ర ఎండలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచే మండిపోతున్న ఎండల కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. మధ్యాహ్న సమయాల్లో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉష్ణోగ్రతలు 35 నుండి 45 డిగ్రీల వరకు నమోదవుతుండడం, వడగాలులు వీస్తుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రత్యేకంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, కూలీలు, కార్మికులు ఎండలకు తాళలేక సతమతమవుతున్నారు. తీవ్ర ఎండల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య మరింత పెరిగింది. బోర్లు ఎండిపోవడం, నీటి సరఫరా సరిగా లేకపోవడం వల్ల ప్రజలు మంచినీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణ ప్రాంతాల్లో కూడా చల్లని నీరు, శీతల పానీయాలకు భారీగా డిమాండ్ పెరిగింది. మరోవైపు ఎండల తీవ్రతతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఫ్యాన్లు, కూలర్లు, ఎయిర్ కండిషనర్లు అధికంగా వినియోగించడంతో కొన్నిచోట్ల విద్యుత్ లోడ్ పెరిగి అంతరాయాలు ఏర్పడుతున్నాయి. విద్యుత్ కోతలతో ప్రజలు మరింత ఇబ్బందులు పడుతున్నారు. వైద్య నిపుణులు ప్రజలకు పలు సూచనలు చేస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. తగినంత నీరు తాగడం, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవడం, పలుచటి దుస్తులు ధరించడం, చిన్నపిల్లలు మరియు వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం అవసరమని సూచిస్తున్నారు.తీవ్ర ఎండల నేపథ్యంలో ప్రభుత్వం ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రహదారులు, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, తాగునీటి సదుపాయాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాను మెరుగుపరచడం వంటి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్య పరిరక్షణ చర్యలు పాటిస్తేనే ఎండల ప్రభావం నుంచి రక్షణ పొందగలరని నిపుణులు సూచిస్తున్నారు.



## వడదెబ్బతో ఇద్దరి మృతి

జిల్లాలో వడదెబ్బతో ఇద్దరు బుధవారం మృతి చెందారు. మందస మండలం బాలిగాం పంచాయతీ రంగనాథపురం గ్రామానికి చెందిన నడుపూరి కృష్ణారావుతో పాటు సోంపేట మండలం పలాసపురం గ్రామానికి చెందిన సింహాచలం పాణిగ్రాహీ (68) వడదెబ్బతో మృతి చెందారు. మందస మండలంలోని బాలిగాం పంచాయితీ రంగనాధపురం గ్రామానికి చెందిన నడుపూరి కృష్ణారావు(35) వడదెబ్బకు గురై బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. బహిర్భూమికి వెళ్తున్నానని చెప్పిన ఆయన పొలాల్లోకి వెళ్లి వచ్చిన అనంతం ఇంటి ముందు గల వాకిట్లో స్రృహ తప్పి పడిపోయాడు. వెంటనే గ్రామస్తులు సపర్యలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. వడదెబ్బకు అక్కడికక్కడే మృతి చెందినట్టు నిర్ధారించుకున్నారు. మృతునికి ఆయనకు భార్య రేఖాకుమారి ఉంది. భర్త వడదెబ్బకు గురై మృతి చెందడంతో ఆమె కన్నీరు మున్నీరుగా విలపించింది. కృష్ణారావు పేద కుటుంబం కావడంతో ప్రభుత్వం ఆదు కోవాలని భార్య, గ్రామస్తులు కోరుతున్నారు.. అలాగే సోంపేట మండలానికి చెందిన సింహాచలం పాణిగ్రాహి ఆరుబయట స్నానం చేస్తూ ఎండకు తాళలేక కుప్పకూలి మరణించాడు.

- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- పలు మండలాల్లో తీవ్ర వడగాలులు
- అప్రకటిత విద్యుత్ కోతలు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న చిన్నారులు, వృద్ధులు
- మందస, సోంపేట మండలాల్లో వడదెబ్బకు ఇద్దరు మృతి

## పలు కుటుంబాలను పరామర్శించిన జుత్తు నీలకంఠం

**మందస, మే 27(వార్త):** అగ్నికుల క్షత్రియ సంఘం సీనియర్ నాయకుడు, మాజీ ఎంఎల్ స్వర్గీయ జుత్తు జగన్నాయకుల సోదరుడు జుత్తు నీలకంఠం బుధవారం పలు కుటుంబాలను పరామర్శించారు. ఓదార్పు కార్యక్రమంలో భాగంగా పలాస నియోజకవర్గంలోని మందస మండలం బాలిగాం గ్రామంలో గ్రామపెద్ద, మాజీ ఎంపీటీసీ బొంగి వెంకయ్య కుటుంబాన్ని పరామర్శించారు. గుడ్డిబద్ర గ్రామంలో న్యాయవాది దున్న లోకనాథం, జర్నలిస్ట్ దున్న గాంధీవర్మల సోదరి తెప్పల కాంతమ్మ మరణించగా.. వారి కుటుంబాన్ని కూడా పరామర్శించి, ఓదార్చారు. మర్రిపాడు గ్రామంలో దున్న తులసిరావు కిడ్నీ వ్యాధితో మరణించగా.. ఆయన కుటుంబాన్ని, పలాస మండలంలో కంజాల గ్రామంలో గ్రామ పెద్ద తెప్పల గణపతి కుటుంబాన్ని పరామర్శించి, మృతుల పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.



## రాజకీయ రంగంలో మహిళలకు ప్రాధాన్యత

- టీడీపీలో 33 శాతం సీట్లు మహిళలకే
- మహానాడులో ప్రకటించిన నారా లోకేష్
- ధన్యవాదాలు తెలిపిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, మే 27 (వార్త):** తెలుగుదేశం పార్టీలో మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారని, రాజకీయ రంగంలో మహిళలను ప్రోత్సహిస్తున్నారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మహానాడులో ఆ పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ రాజకీయాల్లో మహిళలు అనే అంశంపై మాట్లాడుతూ పార్లమెంట్లో ఇటీవల మహిళా బిల్లు వీగిపోయినప్పటికీ టిడిపి మాత్రం మహిళలకు 33% రాజకీయాల్లో చోటు కల్పిస్తుందని ప్రకటించారు. దీంతో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆది నుంచి రాజకీయరంగంలో మహిళలకు ఎనలేని ప్రోత్సాహం అందిస్తున్నారని, ఓ మహిళను శాసనసభాపతిగా ఎన్నుకున్న ఘనత టిడిపిదని గుర్తు చేశారు. టిడిపి ఆవిర్భావం నుంచి నేటి వరకు అదే ఒరవడిని కొనసాగిస్తూ మహిళల్లో రాజకీయ చైతన్యాన్ని రగులుస్తున్నారని కొనియాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కూడా మహిళలకు పెద్దపీట వేశారని, మంత్రులుగా మహిళలు పనిచేస్తుండడం ఇందుకు నిదర్శనం అన్నారు. మరోవైపు పార్టీ కమిటీల్లో కూడా మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని కితాబునిచ్చారు.

## ఉపాధి హామీ కార్మికులకు రూ.500 వేతనం కల్పించాలి




**జలుమూరు, మే 27 (వార్త):** జలుమూరు మండలం రాయపాడులో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నరసింహమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు, పనుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నాయకత్వంలో ప్రారంభమైన ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. వలసలను నివారించి గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పనికి ఆహార పథకం రూపంలో ప్రారంభమైన ఈ పథకం నేటికీ కొనసాగుతూ పేదల జీవనోపాధికి అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను తగ్గించడంతో పాటు రైతు కూలీలకు ఉపాధి కల్పించడంలో ఉపాధి హామీ పథకం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. అయితే ప్రస్తుత ధరల పరిస్థితుల్లో కార్మికులకు అందుతున్న వేతనం సరిపోవడం లేదని, రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు కలిసి రోజుకు కనీసం రూ.500 వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులను మరింత పారదర్శకంగా నిర్వహిస్తూ కార్మికులకు సమయానికి వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు. గ్రామీణాభివృద్ధి మరియు పేదల సంక్షేమానికి ఉపాధి హామీ పథకం బలోపేతం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక చర్యలు



**జలుమూరు, మే 27 (వార్త):** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) బమ్మిడి మాధవరావు తెలిపారు. బుధవారం జలుమూరు మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపుపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా గోలియాపుట్టి గ్రామంలో ఉపాధ్యాయ బృందంతో కలిసి ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కలుసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా సదుపాయాల గురించి వివరించారు. నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, డిజిటల్ బోధన వంటి సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పిస్తున్నామని, పిల్లల భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమం ఫలితంగా ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు ఎంఈఓ తెలిపారు. విద్యా హక్కు ప్రతి చిన్నారికి అందేలా కృషి చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల చేరికలు పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బైక్ ఢీకొని యువకుడి మృతి



**నరసన్నపేట, మే 27(వార్త):** నరసన్నపేటలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో ప్రమాదానికి సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం రాత్రి నరసన్నపేటలోని వెంకటేశ్వర థియేటర్ ఎదుట ప్రధాన రహదారిపై బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరసన్నపేటకు చెందిన పవన్ (30) తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాద సమయంలో బైక్‌ను ప్రసాద్ నడుపుతుండగా, పవన్ వెనుక కూర్చుని ఉన్నట్లు తెలిసింది. ఇదే సమయంలో గార మండలం బందరువానిపేటకు చెందిన అప్పన్న మరో ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టినట్లు సీసీ కెమెరా దృశ్యాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఏఎస్ఐ తులసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో మృతుడి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రాత్రి వేళల్లో వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానికులు సూచిస్తున్నారు.

### మహానాడు మా ఊరిలోనే..

- న్యాయం కోసం 700 రోజులుగా కన్నీటి దీక్ష.. పలకరించే నాథుడే కరువు
- మా ఓట్లతో గద్దెనెక్కారు.. మా శవాలపై మహానాడు చేస్తారా?
- -- హామీ ఇచ్చి మరిచారు - నగేష్ సోదరుడు మేఘనాథ్ నిప్పుల వర్షం

# మాకేమో మరణ శాసనమా?



**పలాస, మే 27 (వార్త):** "మహానాడు మా ప్రాంతంలో పెట్టుకుంటున్నారు సంతోషమే.. కానీ నా తమ్ముడి (నగేష్) శవాన్ని న్యాయం కోసం 700 రోజులుగా ఊరేగిస్తుంటే పలకరించే మొగోడు లేడే? మా ఓట్లతో గద్దెనెక్కి, మా శవాలపై మహానాడు చేస్తారా?" అంటూ మృతుడు మువ్వల నగేష్ సోదరుడు మువ్వల మేఘనాథ్ నిప్పులు చెరిగాడు. బుధవారం నువ్వలరేవులో పాత్రికేయుల ముందుకు వచ్చిన మేఘనాథ్, "సామాన్యుడికి న్యాయం జరగనప్పుడు మహానాడు ఎందుకు? పండగలు ఎందుకు? చచ్చినోడి ఉసురు తగిలితే కుర్చీలు కదులుతాయి" అంటూ పాలకులను హెచ్చరించాడు. శ్రీకాకుళం ఎచ్చెర్ల శివాని కాలేజీలో బీటెక్ చదువుతూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మత్స్యకార యువకుడు మువ్వల నగేష్ కేసు ఐదేళ్లుగా మిస్టరీగానే ఉందని, "2021లో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు 'న్యాయం చేస్తాం' అని చెప్పి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. 2024లో ఎమ్మెల్యే గౌతు శిరీష మా గడప తొక్కి 'న్యాయం చేయకపోతే నా పేరు మార్చుకుంటా' అని శపథం చేశారని, మంత్రి లోకేష్ మాట ఇచ్చారని గుర్తు చేశారు. రెండేళ్లు గడిచాయి.. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇదేనా మీరు చెప్పే ప్రజా పాలన? ఇదేనా లోకేష్ మార్క్ మార్పు?" అంటూ మేఘనాథ్ ప్రశ్నల వర్షం కురిపించాడు. "గత ఎన్నికల్లో మా ఊరితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి 4,000 ఓట్లు గంపగుత్తగా టీడీపీకి వేశాం. మా ఓట్లతో గెలిచి, మా నెత్తినే మహానాడు పెడుతున్నారు. మా తమ్ముడిని చంపినోడిని పట్టుకోలేరు కానీ, పండగ చేసుకోవడానికి మాత్రం సిగ్గుండదా?" అంటూ ఆవేదనతో గద్గద స్వరంతో ప్రశ్నించాడు. ఈ కేసులో తమకు అండగా నిలిచింది ఒక్క దువ్వాడ శ్రీధర్ (బాబా) మాత్రమేనని మేఘనాథ్ స్పష్టం చేశాడు. "సీబీఐ విచారణ కావాలని బాబా డిమాండ్ చేస్తుంటే, కోర్టుకు వెళ్లడానికి సాయం చేస్తుంటే.. ఆయనపై సోషల్ మీడియాలో బురద చల్లడం ఎంత వరకు న్యాయం?. ప్రశ్నించిన గొంతు నొక్కేస్తారా? ఇదేనా మీ ప్రజాస్వామ్యం?" అంటూ మండిపడ్డాడు. "నగేష్ మంచి చదువుకునే పిల్లాడు. కుటుంబానికి ఆసరా అవుతాడనుకున్నాం. వాడి చావు మా బతుకును చిద్రం చేసింది" అంటూ గ్రామ పెద్దలు కన్నీరు పెట్టుకున్నారు. "ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలి. సీబీఐతో నిజాలు నిగ్గు తేల్చాలి" అని డిమాండ్ చేశారు. దువ్వాడ శ్రీధర్ లేవనెత్తిన ప్రశ్నలకు ఎమ్మెల్యే గౌతు శిరీష మహానాడు వేదికగానైనా బహిరంగంగా సమాధానం చెప్పాలని మేఘనాథ్ డిమాండ్ చేశాడు.

"లేకపోతే నగేష్‌కు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు. జిల్లా వ్యాప్తంగా మత్స్యకార జాతిని ఏకం చేసి ఉద్యమం ఉధృతం చేస్తాం. అప్పుడు మహానాడు కాదు.. మహా యుద్ధమే చూస్తారు" అని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చాడు. మువ్వల నగేష్ మృతి కేసులో పోలీసుల దర్యాప్తు నివేదిక ఇప్పటికీ బయటకు రాలేదు. బాధిత కుటుంబం సీబీఐ విచారణ కోరుతోంది. మరి మహానాడు వేదికగా పాలకులు ఏం సమాధానం చెబుతారో వేచి చూడాలి.

# నక్సల్‌బరీ ఉద్యమం ఉంటుంది

### ఘనంగా శ్రీకాకుళ అమరవీరుల 37వ సంస్మరణ సభ



**పలాస, మే 27 (వార్త):** సమాజంలో అసమానతలు ఉన్నంతకాలం నక్సల్‌బరీ ఉద్యమం సజీవంగా ఉంటుందని, నక్సల్‌బరీ కేవలం చరిత్ర మాత్రమే కాకుండా వర్తమానం, భవిష్యత్తు కూడా అని వక్తలు పేర్కొన్నారు. బొడ్డపాడు గ్రామంలో బుధవారం శ్రీకాకుళ అమరవీరుల 37వ సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. 1990లో నిర్మించిన శ్రీకాకుళ అమరవీరుల స్మారక భవనం వద్ద ప్రతి ఏడాది మే 27న స్థానిక గ్రామ ప్రజలు, వివిధ విప్లవ సంస్థలు కలిసి అమరవీరుల సంస్మరణ సభలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కార్యక్రమం 37వ అమరవీరుల స్మారక కమిటీ కన్వీనర్ పోతనపల్లి కుసుమ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో విరసం రాష్ట్ర కార్యదర్శి రేవేరా, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోల ఈశ్వరరావు, సిపిఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు డి. హరనాథ్, జనశక్తి జిల్లా కార్యదర్శి కోనేరు రమేష్ తదితర వక్తలు మాట్లాడుతూ అసమానతలతో కూడిన సమాజంలో సమానత్వం కోసం ఉద్యమాలు అనివార్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ప్రజాస్వామిక హక్కులపై దాడులు పెరుగుతున్నాయని, పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజల జీవితం సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధవలస - అర్ధభూస్వామ్య వ్యవస్థలో నూతన ప్రజాస్వామ్య విప్లవం అవసరమని, ఉద్యమాలు తాత్కాలిక ఒడిదుడుకులు ఎదుర్కొన్నా శాశ్వతంగా అణచివేయలేమని వక్తలు తెలిపారు. సమస్యలు ఉన్నంతకాలం ప్రజా ఉద్యమాలు వివిధ రూపాల్లో మళ్లీ పుట్టుకొస్తాయని పేర్కొన్నారు. ముందుగా అరుణ పతాకాన్ని కామ్రేడ్ పోతనపల్లి పారమ్మ జీవిత సహచరుడు జోగి కోదండం, జయక్క కుమారుడు మల్లేశ్వరరావు ఈ కార్యక్రమంలో 37వ కమిటీ సభ్యులు ప్రజా సంఘాలు వివిధ పార్టీల యువజన సంఘాలు ఉద్దాన ప్రాంత ప్రజలు భాగస్వామ్యం ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

### జనరల్ అభ్యర్థులకు ఉద్యోగాలకు వయో పరిమితి పెంచండి



**పలాస, మే 27 (వార్త):** జనరల్ అభ్యర్థులకు ఉద్యోగాలకు వయోపర్లమితి పెంచాలని సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చాలా కాలంగా వివిధ ప్రభుత్ర ఉద్యగాలకు నోటిఫికేషన్స్ లేక నిరుద్యోగులకు వయోపరిమితి దాటిపోయిందని, ప్రభుత్రం స్పందించి జనరల్ అభ్యర్థులకు వయోపరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. అన్ని శాఖలలో వయోపరిమితి పెంచాలని, జనరల్ అభ్యర్థులకు వయోపరిమితిని 18 నుండీ 46 పెంచాలని కూటమి ప్రభుత్వం నికి డిమాండ్ చేశారు.

# మూడు చోట్లా ఘనంగా మహానాడు





**మెళియాపుట్టి మే 27(వార్త):** మెళియాపుట్టి మండలంలో స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు నేతృత్వంలో చాపర, మర్రిపాడు, గొప్పిలిలలో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న వర్చువల్ విధానం ద్వారా మహానాడు కార్యక్రమాన్ని బుధవారం నాడు నిర్వహించారు. దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ప్రతి ఏటా జరిగే రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతంలో మహానాడు కార్యక్రమం జరిగేది, కానీ ఈ ఏడాది ఇంధన పొదుపు చర్యలలో భాగంగా మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు దేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఘనంగా నిర్వహించారు. మండలంలో మర్రిపాడు, చాపర, గొప్పిలి లలో 3 క్లస్టర్లలో వర్చువల్ విధానంలో మహానాడు కార్యక్రమాలను అన్ని ప్రాంతాలలో గ్రామస్థాయి, మండల స్థాయిలో కార్యకర్తలకు, నాయకులకు, అనుసంధానం చేయడానికి మండలంలో 3 క్లస్టర్లలో మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లస్టర్లలో జరిగే మహానాడు కార్యక్రమానికి వచ్చే నాయకులు కార్యకర్తలకు భోజన ఏర్పాట్లను స్థానిక శాసనసభ్యులు ఏర్పాటు చేశారు. గ్రామస్థాయి, మండల స్థాయిలో ఉన్న కార్యకర్తలు, నాయకులలో ఎక్కువగా చాపర క్లస్టర్లో జరిగే మహానాడు కార్యక్రమంలో ఎక్కువగా పాల్గొన్నట్టుగా కనిపిస్తుంది. క్లస్టర్లలో వర్చువల్ విధానంలో జరిగే మహానాడు కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



### జగన్‌ను కలిసిన నర్తు



**సోంపేట, మే 27 (వార్త):** వైసిపి అధినేత వైయస్ జగన్ ను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు బుధవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యక్రమాలపై అక్కడికి వెళ్లిన రామారావు జగన్తో కలిసి ఇచ్ఛాపురం వైసిపి పరిస్థితులను గూర్చి వివరించారు.

# నెహ్రూ సేవలను స్మరించిన కాంగ్రెస్ నాయకులు



**జలుమూరు, మే 27 (వార్త):** భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ 62వ వర్థంతి సందర్భంగా జలుమూరు మండలం చల్లవానిపేట జంక్షన్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించారు. ఈ సందర్భంగా నరసన్నపేట కాంగ్రెస్ కంటెస్టు ఎమ్మెల్యే శ్రీ మంత్రి నరసింహమూర్తి మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో నెహ్రూ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఐఐటీలు, భారీ ప్రాజెక్టులు, సాగునీటి మరియు త్రాగునీటి పథకాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన పునాది వేశారని పేర్కొన్నారు. నెహ్రూ దూరదృష్టితో ప్రారంభమైన పలు సంస్థలు, ప్రాజెక్టులు నేటి తరానికి ఎంతో ఉపయోగకరంగా నిలిచాయని అన్నారు. దేశ పారిశ్రామిక, విద్యా రంగాల అభివృద్ధికి నెహ్రూ విశేష కృషి చేశారని, శాస్త్రసాంకేతిక రంగానికి ఆయన ఇచ్చిన ప్రాధాన్యం వల్లే భారత్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జలుమూరు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొండా కేశవరావు, జిల్లా కార్యదర్శి బేరి వెంకటరమణ, నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ మామిడి సత్యనారాయణ, లింగాలవలస మాజీ సర్పంచ్ కిల్లి వెంకటరావు, కార్మికులు మరియు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మాకన్నపురం మహానాడుకు విశేష స్పందన



**సోంపేట, మే 27(వార్త):** మాకన్నపురం గ్రామంలో క్లస్టర్ 10 ఇంచార్జ్ మద్దిల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మహానాడు వర్చువల్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.

ఏఎంసీ చైర్మన్ మద్దిల విజయలక్ష్మి, క్లస్టర్ కో ఇంచార్జ్ లోకనాథ్ మహంతి యూనియన్ ఇన్చార్జెస్ మల్ల కోదండరావ్ రత్నాల వెంకటరమణ తామాడ పాపారావు బేసి కిషోర్ బతకల దీర్ఘం తదితరుల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు నేతలు పాల్గొన్నారు. కార్యక్రమం అభ్యంతరం మహానాడు విశేషాలు తెలుసుకున్నారు.

# ఎన్టీఆర్ ఆశయాలే టీడీపీకి దిక్సూచి

**-పలాసలో పసుపు దండు**

**-తెలుగు తమ్ముళ్లలో నూతనోత్తేజం**

**- గ్రామాలన్నీ పసుపుమయం**

**-కార్యకర్తల నినాదాలతో మారుమోగిన సభలు**



**పలాస, మే 27 (వార్త):** పలాస నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మహానాడు వేడుకలు తెలుగు తమ్ముళ్లు నూతన ఉత్తేజం గోచిరించింది. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలాస, పూండి, చినవంక గ్రామాల్లో బుధవారం నిర్వహించిన మహానాడు కార్యక్రమాలు టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. గ్రామాలన్నీ పసుపు జెండాలతో కళకళలాడగా కార్యకర్తల సందడితో, జై జై టిడిపి.. జై టిడిపి అంటూ నినాదాలతో సభ ప్రాంగణాలు దద్దురిలాయి. మహిళలు, యువత, అభిమానులు, సీనియర్ నాయకులు భారీ సంఖ్యలో హాజరుకావడంతో మహానాడు సభలు రాజకీయ శక్తి ప్రదర్శనగా మారాయి. ముఖ్య అతిథిగా హాజరైన పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీ స్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశయాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం టీడీపీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రతి ఇంటికీ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు చేరేలా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, బూత్ స్థాయి కమిటీలను పటిష్ఠం చేయాలని, యువతను పెద్ద ఎత్తున పార్టీలోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. రానున్న రోజుల్లో వజ్రపుకొత్తూరు మండలంతో పాటు పలాస నియోజకవర్గం మొత్తం టీడీపీకి కంచుకోటగా మారేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని వెంకన్న చౌదరి పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని స్పష్టం చేశారు. సభ అనంతరం కార్యకర్తలు భారీ ర్యాలీలు నిర్వహించి పార్టీ జెండాలు ఊపుతూ నినాదాలతో హోరెత్తించారు. పలాస నియోజకవర్గంలో మహానాడు విజయవంతం కావడంతో టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, సీనియర్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇది రాజ్యాంగం గెలిచిన రోజు

**- ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు తీర్పుపై న్యాయవాది దువ్వాడ శ్రీధర్ హర్షం**

**- ఓటు పోయినా పౌరసత్వం పోదని చెప్పడం చారిత్రాత్మకం**



**పలాస, మే 27 (వార్త):** "ఇది రాజ్యాంగం గెలిచిన రోజు.. ఇది పౌరుడి గుండెకు భరోసా" అంటూ సుప్రీంకోర్టు ఎస్ఐఆర్ తీర్పుపై ప్రముఖ న్యాయవాది దువ్వాడ శ్రీధర్ (బాబా) స్పందించారు. బుధవారం పలాసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతించారు.

## ఎన్నికల సంఘం

### విధి విధానాలు - హద్దులు:

"భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించే బాధ్యత ఉంది. అందులో భాగంగానే ప్రజాప్రాతినిధ్య చట్టం-1950 సెక్షన్ 21 కింద ఓటర్ల జాబితాను సవరించే అధికారం సంఘానికి ఉంది. మరణించినవారు, డూప్లికేట్ ఓట్లు, చిరునామా మారినవారి పేర్లు తొలగించడం, కొత్త ఓటర్లను చేర్చడం ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశం. కానీ దీనికి ఒక లక్ష్మణరేఖ ఉంది. పౌరసత్వ చట్టం-1955 ప్రకారం ఒక వ్యక్తి భారతీయుడా కాదా అని తేల్చే అధికారం కేవలం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంది. ఎన్నికల సంఘం ఆ హద్దు దాటకూడదని సుప్రీంకోర్టు ఈరోజు మరోసారి స్పష్టం చేసింది" అని శ్రీధర్ వివరించారు.

## భారత రాజ్యాంగం

### - ఓటర్ల హక్కు:

"ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక రాజకీయ హక్కు. ఆర్టికల్ 326 ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు ఉంది. దాన్ని ఏ కారణం లేకుండా హరించే అధికారం ఎవరికీ లేదు. 'ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించినంత మాత్రాన ఒక వ్యక్తి పౌరసత్వాన్ని కోల్పోయినట్లు కాదు' అని కోర్టు చెప్పిన మాట భారత రాజ్యాంగ స్ఫూర్తికి నిలువుటద్దం. 'డాక్యుమెంట్ లేదు' అనే సాకుతో సామాన్యుడి ఓటు తీసేస్తే, అది రాజ్యాంగ విరుద్ధమే అవుతుంది" అని ఆయన అభిప్రాయపడ్డారు. "ఈ తీర్పు వల్ల లక్షలాది మంది పేదలు, మత్స్యకారులు, గిరిజనుల గుండెల్లో ఉన్న భయం తొలగిపోయింది. ఓటు హక్కు కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ 'నువ్వు భారతీయుడివి కాదు' అనే ముద్ర వేయడానికి ఎవరికీ అధికారం లేదు. ఇది నిజంగా ప్రజాస్వామ్యానికి మేలు చేసే తీర్పు" అని శ్రీధర్ అన్నారు. ఓటర్ లిస్ట్ నుంచి పేరు తొలగింపునకు గురైన బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు పలాసలోని తన కార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు దువ్వాడ శ్రీధర్ తెలిపారు. తీర్పు కాపీలను కూడా అందుబాటులో ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

# బడి పిలుస్తుందిలో భాగస్వాములు కండి



**మందస, మే 27(వార్త):** ప్రభుత్వం విలువలుతో కూడిన విద్యను సకల సౌకర్యాలుతో ప్రభుత్వ పాఠశాలలులో అందజేసే ఉదేశ్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేపడుతున్న గ్రామాల్లో బడి పిలుస్తుంది కార్యక్రమంలో మహిళా సంఘాలు అంతా భాగస్వాములు కావాలని మందస వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన వెలుగు సిబ్బందికి అవగాహన, సమీక్షా సమావేశం లో పాల్గొని మాట్లాడారు. వెలుగు సిబ్బంది జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం గ్రామ గ్రామనా సమావేశాలు నిర్వహించి అందరికీ అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. తల్లిదండ్రులు అందరికీ శారీరకంగా, మానసికంగా ఆరోగ్య వంతమైన పిల్లలే ప్రధానమైన ఆస్తి అని, అలాంటి పిల్లల శారీరక , మానసిక భవిష్యత్ కోసం ఆలోచించకుండా కనీస వెంటిలేషన్, ఆటస్థలం సౌకర్యం కూడా లేని ప్రవేట్ పాఠశాలలుకు ఫీజులు కూడా కట్టి మరీ పంపించి చిన్నారులపై అనవసర ఒత్తిడి పెంచి పిల్లల అనారోగ్యంకు పరోక్షంగా కారణం అవుతున్నారని వివరించారు. తల్లిదండ్రులు అంతా బాధ్యతగా ఆలోచించేటట్లు గ్రామాలలో వివరించాలన్నారు. శిక్షణ పొంది అనుభవం గల ఉపాధ్యాయులు బోధిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు లో ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు తో పాటు పిల్లల ఆరోగ్యం దృష్ట్యా చక్కని పౌష్టికాహారం కూడా అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలులో చేర్పించడం ద్వారా ట్రిబుల్ ఐ.టీ.లాంటి ఉన్నత చదువులు పొందడానికి మీ పిల్లలుకు అవకాశం కల్పించాలని తల్లిదండ్రులుకు అర్థమయ్యేటట్లు వివరించాలన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్లు కళ్యాణి, భాగ్యలక్ష్మి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావుతో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్లు, గ్రామ సంఘం వి.ఓ.ఏ.లు పాల్గొన్నారు.

# ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి అడ్మిషన్లు ప్రారంభం

**- ప్రవేశ పరీక్షలో ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల**

**- జూన్ 1లోపు అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచన**



**జలుమూరు, మే 27 (వార్త):** ఏపీ మోడల్ స్కూల్, కరవంజలో 6వ తరగతి ప్రవేశ పరీక్షలో ఎంపికైన విద్యార్థుల జాబితాను పాఠశాల నోటీస్ బోర్డులో ప్రదర్శించినట్లు ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నిర్ణీత గడువులోగా అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. అడ్మిషన్ల కోసం ఎంపికైన విద్యార్థులు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ లేదా రికార్డు షీట్, స్టడీ సర్టిఫికెట్, విద్యార్థి మరియు తల్లిదండ్రుల ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, సర్టిఫికెట్ ఫోల్డర్ కవర్ తదితర పత్రాలతో జూన్ 1, 2026లోపు పాఠశాలకు హాజరుకావాలని తెలిపారు. అడ్మిషన్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పాఠశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9440322964 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు గడువు తేదీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ధ్రువపత్రాలతో సమయానికి హాజరై అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని పాఠశాల యాజమాన్యం కోరింది.

# జనగణన పూర్తికి సమష్టిగా కృషి చేయాలి

**- లక్ష్య సాధనకు సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి**

**- తహశీల్దార్ సత్యనారాయణ సూచన**

**- 29,819 కుటుంబాల్లో ఇప్పటికే 28,500 కుటుంబాల సర్వే పూర్తి**

**నరసన్నపేట, మే 27 (వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న జనగణన కార్యక్రమాన్ని శతశాతం పూర్తి చేసే దిశగా ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాలని నరసన్నపేట తహశీల్దార్ సత్యనారాయణ సూచించారు. మంగళవారం సయంత్రాం నరసన్నపేట తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలాన్ని మొత్తం 134 బ్లాకులుగా విభజించి జనగణన సర్వే చేపట్టినట్లు తెలిపారు. మండల పరిధిలో మొత్తం 29,819 కుటుంబాల్లో సర్వే నిర్వహించాల్సి ఉండగా ఇప్పటివరకు 28,500 కుటుంబాల్లో సర్వే పూర్తయిందన్నారు. మిగిలిన కుటుంబాల వివరాలను కూడా త్వరితగతిన నమోదు చేసి లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించాలని సిబ్బందికి సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా నమోదు చేయాలని, ప్రభుత్వానికి సమగ్ర సమాచారం అందించడంలో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో సర్వే విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు.



ప్రతి ఇంటిని సందర్శించి ఖచ్చితమైన సమాచారం సేకరించేందుకు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పెండింగ్‌లో ఉన్న సర్వేలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో జనగణన వివరాలు కీలకమని ఆయన వివరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ముగింపు దశకు సవర బెజ్జి-సంగంవలస రహదారి



**సారవకోట, మే 27 (వార్త):** సారవకోట మండలంలోని సవర బెజ్జి--సంగంవలస గ్రామాలను కలుపుతూ నిర్మిస్తున్న రహదారి పనులు ప్రస్తుతం ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ రహదారి నిర్మాణంతో పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు రూ.కోటి నిధులతో ఈ రహదారి నిర్మాణ పనులను చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, గిరిజన గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. అయితే రహదారి నిర్మాణానికి అవసరమైన అటవీ శాఖ అనుమతులు ఆలస్యంగా రావడంతో కొంతకాలం పనులు నెమ్మదించాయి. అనుమతుల ప్రక్రియ పూర్తయిన అనంతరం నిర్మాణ పనులు వేగవంతం చేయడంతో ప్రస్తుతం తుది దశకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రహదారి పూర్తయితే సవర బెజ్జి, సంగంవలసతో పాటు సమీప గ్రామాల ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా కూడా సులభతరం కానుంది. ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే రాకపోకల ఇబ్బందులు తగ్గనున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి




**పోలాకి, మే 27 (వార్త):** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఓటీపీ వివరాలను ఎవరికీ వెల్లడించకూడదని టెక్కలి డివిజన్ శక్తి బృందం సభ్యులు హెచ్చరించారు. బుధవారం పోలాకి మండలం కొత్తగెడ్డలో ఉపాధి హామీ పథకం పనుల వద్ద కార్మికులకు సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి బృందం సభ్యులు మాట్లాడుతూ, ఇటీవల కాలంలో ఫోన్ కాల్స్, సందేశాల ద్వారా సైబర్ మోసాలు అధికమవుతున్నాయని తెలిపారు. బ్యాంకు అధికారులు, ప్రభుత్వ ప్రతినిధులమంటూ కొందరు వ్యక్తులు ఓటీపీలు, బ్యాంకు వివరాలు అడిగి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు, ఏటీఎం పిన్ నంబర్లు, బ్యాంకు ఖాతా వివరాలు ఇతరులతో పంచుకోరాదని సూచించారు. ఇటీవల ప్రియాగ్రహారానికి చెందిన ఓ మహిళ సైబర్ మోసగాళ్ల బారినపడి డబ్బులు కోల్పోయిన ఘటనను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. డిజిటల్ లావాదేవీలు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండటం ద్వారా సైబర్ నేరాలను నివారించవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా సైబర్ అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు గిరిధర్, భీమారావు, డబ్ల్యూపీసీ ధనలక్ష్మి, ఉపాధి హామీ కార్మికులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గంజాయి, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



**పోలాకి, మే 27(వార్త):** గంజాయి, మాదకద్రవ్యాల వినియోగానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్సై రంజిత్ మరియు ఈగల్ టీం సభ్యులు ఉదయ్ కుమార్ సూచించారు. మంగళవారం రాత్రి పోలాకి మండలం రాజారాంపురంలోని పెద్ద పోలేరమ్మ జాతర మహోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వారు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మత్తుపదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై వివరించారు. ముఖ్యంగా యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అలవాట్లు భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మాదకద్రవ్యాల కారణంగా ఆరోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు, నేరప్రవృత్తి పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ పరిసరాల్లో గంజాయి లేదా ఇతర మత్తుపదార్థాల వినియోగం, విక్రయాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 1972 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, యువత మంచి మార్గంలో సాగేందుకు తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులు పేర్కొన్నారు. జాతరలో పాల్గొన్న యువత, స్థానిక ప్రజలు అవగాహన కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, జాతర కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలకు సహకారం

**నరసన్నపేట, మే 27 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు మండల విద్యాశాఖ అధికారులతో పాటు తాము కూడా పూర్తి సహకారం అందిస్తామని నరసన్నపేట తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో కేవీ ప్రసాద్‌రావు తెలిపారు. బుధవారం నరసన్నపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మండల పరిధిలో మొత్తం 82 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, ప్రతి పాఠశాలలో రోజుకు కనీసం ఒక విద్యార్థిని చేర్పించినా లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల చేరికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం అవసరమని, అందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం





## మతసామరస్యానికి, త్యాగానికి ప్రతీక బక్రీద్: ఎస్పీ

**శ్రీకాకుళం, మే27 (వార్త):** బక్రీద్ (ఈదుల్ అజ్ హా) పండగను మతసామరస్యానికి ప్రతీకగా కుల, మతాలకు అతీతంగా సోదరభావంతో, శాంతియుతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. పండగ సందర్భంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమైన మసీదుల వద్ద బందోబస్తు, డ్రోన్స్, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే అసత్య ప్రచారాలను నమ్మవద్దని, అనుమానాస్పద సమాచారం లేదా గోవధ, పశువుల అక్రమ రవాణా గురించి డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## దాహార్తి సమస్యకు పరిష్కారం



**కంచిలి, మే 27(వార్త):** పెద్ద శ్రీరాంపురం పంచాయతీ చిన్న శ్రీరాంపురం గ్రామంలో చెడిపోవడంతో తాగునీటి సమస్య నెలకొంది. గ్రామస్తులు కోరిక మేరకు మాజీ సర్పంచ్ మాదిన రామారావు పంచాయతీ నిధులు వెచ్చించి కొత్త మోటారు కొనుగోలు చేసి వెంటనే మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


## 'పారాక్వాట్ డీక్లోరైడ్' గడ్డిమందుపై నిషేధం



**జలుమూరు, మే 27 (వార్త):** పంట పొలాల్లో కలుపు నివారణకు ఉపయోగించే 'పారాక్వాట్ డీక్లోరైడ్ 24% ఎస్ఎల్' గడ్డిమందు ఉత్పత్తి, అమ్మకాలు, నిల్వలపై ప్రభుత్వం నిషేధం విధించినట్లు జలుమూరు వ్యవసాయ అధికారి కింజరాపు రవికుమార్ తెలిపారు. ఈ నిషేధాన్ని ప్రతి వ్యాపారి తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు ఎరువుల, పురుగుమందుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన మరియు విక్రయానికి సిద్ధంగా ఉన్న సుమారు 230 లీటర్ల 'పారాక్వాట్ డీక్లోరైడ్ 24% ఎస్ఎల్' గడ్డిమందు అమ్మకాలను నిలిపివేస్తూ సంబంధిత దుకాణాదారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ మార్గదర్శకాలను ఉల్లంఘించి నిషేధిత గడ్డిమందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో రవికుమార్ హెచ్చరించారు. రైతులు కూడా నిషేధిత రసాయనాల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. పంటల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, రైతుల భద్రత దృష్ట్యా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అందరూ సహకరించాలని ఆయన కోరారు. వ్యవసాయ రంగంలో సురక్షిత పద్ధతులను ప్రోత్సహించేందుకు తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే ఇన్‌చార్జిలపై చర్యలు

### -శ్యాం గోఏ హెడ్ -మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి



**ఇచ్ఛాపురం మే 27 (వార్త):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి , వైస్సార్సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ ఇచ్ఛాపురం నియోజకవర్గం బూత్ కమిటీ కన్వీనర్ సాలిన గాంధీ లతో కలిసారు. జగన్మోహన్ రెడ్డి ఇచ్ఛాపురం నియోజకవర్గం పార్టీ పరిస్థితి ని గూర్చి దీర్ఘంగా చర్చించినట్లు చెప్పారు. కమిటీ ల పురోగతి ని విచారిస్తూ ఒరియా మాట్లాడే వారిని అధికంగా కమిటీలలో చేర్చాలని సూచించారని, మత్స్యకారుల నాయకత్వాన్ని, ఇచ్ఛాపురం నియోజకవర్గానికే పరిమితమైన కొన్ని ఒడియా వర్గాల వారిని నాయకత్వం పెంచవలసిన ఆవశ్యకత గూర్చి పేర్కొన్నారని చెప్పారు. ఎస్ ఐ అర్ కార్యక్రమం, బి ఎల్ ఏ ల శిక్షణ ఆవశ్యకత గూర్చి చెప్పారు.ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎలాగైనా గెలవాలని ఇతర పార్టీలు కనీసం నాయకత్వం ఇవ్వని రెడ్డిక నుంచి శ్యాంప్రసాద్ రెడ్డి కి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి తన మనిషిగా పంపించానని, కష్ట పడి పని చేసే తత్వం యువకుడికి తోడుగా అనుభవం గల నరేంద్ర అనుభవాన్ని జోడించి అందరి నాయకులను సమన్వయం చేసుకుని విజయం దిశగా పయనించాలని ఉత్సాహంగా బుజం తట్టారని చెప్పారు. పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకొని వెళ్లి ప్రజల మద్దతు కూడగట్టాలని, ఇప్పటికే తెలుగుదేశం పార్టీ పట్ల వస్తున్న వ్యతిరేకత ప్రజలు మనల్ని గుర్తు చేసుకుంటున్న అనుకూలతతో ముందుకు దూసుకు పోవాలని ప్రోత్సాహించారని చెప్పారు. అంతకు ముందు జరిగిన రాష్ట్ర స్థాయి పార్టీ సమావేశంలో ప్రస్తుతం రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే ఇన్‌ఛార్జలదే బాధ్యత అని గట్టిగా హెచ్చరించారు. శ్యాం గో ఏ హెడ్ నీ పని నువ్వు చేయి నీ వెనుక ఉన్నా అంటూ భుజం తట్టారని చెప్పారు.

## బీసీవై పార్టీలో చేరికలు

**ఇచ్ఛాపురం, మే 27 (వార్త):** భారతచైతన్యయువజనపార్టీ (బీసీవై) నియోజకవర్గ పార్టీ కార్యాలయం లో ఇచ్ఛాపురం మండలం నుండి పార్టీ లోకి వలసలు మొదలైనాయి. సగ్గు చక్రవర్తి రెడ్డి తరుపున నియోజకవర్గం కన్వీనర్ బడ్డి మురళి ఆధ్వర్యంలో పార్టీ లోకి అన్నెపు ప్రసాద్ రెడ్డి , బుడ్డెపు జోగారావు, మద్దిల సంతోష్ తో పాటు ఇంకొందరు పార్టీ లోకి చేరారు .ఈ చేరికలపై నియోజకవర్గం కన్వీనర్ బడ్డి మురళి మాట్లాడుతూ భారతచైతన్యయువజన పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ నాయకత్వంఈ రాష్ట్ర ప్రజలకు మరియు బడుగు బలహీన వెనుకబడిన వర్గాలకు ఏంతో అవసరమని రాష్ట్రంలో ఉన్న ఎన్నో సమస్యల పరిష్కరానికి సరైన నాయకులు బోడె రామచంద్రయాదవ్ మాత్రమే అని మాట్లాడుతూ ఆయన నాయకత్వంపై వివరిస్తూ ప్రజలకోసం చేస్తున్న ఎన్నో పోరాటాలు ఈరోజు రాష్ట్ర ప్రజల్లో ఒక నూతన విప్లవానికి నాంది అని అలాగే ఈ రాష్ట్రంలో నేడు జరుగుతున్న దోపిడీ దుర్మార్గపాలనకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాలుఈరోజు ప్రజల్లో ఎంతో ఆత్మ విశ్వాసం నింపుతున్నాయి అని అటువంటి నాయకుని నాయకత్వంలో పనిచేయడం మా అదృష్టం అని మురళి అన్నారు. నూతనంగా పార్టీ లోకి వచ్చిన కార్యకర్తలు మాట్లాడుతూ నియోజకవర్గం కన్వీనర్ బడ్డి మురళి నాయకత్వం పై విశ్వాసంతో పార్టీ లోకి రావడం నిజంగా తమ అదృష్టం అని మాట్లాడారు. అలాగే మురళి మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం కష్టపడుతు ప్రజల్లోకి వెళ్లాలని ప్రజలయొక్క సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తూ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తు 2029 గెలుపు దిశగా ప్రయాణిచాలని ప్రతి ఒక కార్యకర్త ఒక సైనికుడు కావాలని అప్పుడే పార్టీ 2029 లో విజయం సాధిస్తుందని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



# నరసన్నపేటలో ఘనంగా మహానాడు వేడుకలు

### - ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా నిర్వహణ

### - "స్త్రీ శక్తి" థీమ్‌తో

### మహిళా సాధికారతపై ప్రత్యేక చర్చలు



**నరసన్నపేట, మే 27 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మహానాడు వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపాయి. మొత్తం 10 క్లస్టర్లలో రెండు రోజుల పాటు వర్చువల్ విధానంలో మహానాడు కార్యక్రమాలను నిర్వహించేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేశారు. మంగళవారం పోలాకి మండలం పిన్నింటిపేటలోని ఉగ్ర నరసింహ కళ్యాణ మండపంలో క్లస్టర్-8, నరసన్నపేట పట్టణంలోని శ్రీ సత్య ఫంక్షన్ హాల్‌లో క్లస్టర్-3, రావులవలస సర్వమంగళ కళ్యాణ మండపంలో క్లస్టర్-4 కార్యక్రమాలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేశారు.



అనంతరం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మహానాడు కార్యక్రమాలు పార్టీ పట్ల ఉన్న అభిమానాన్ని, నాయకత్వంపై కార్యకర్తల విశ్వాసాన్ని ప్రతిబింబించేలా కొనసాగాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలకు ఉత్సాహాన్ని తీసుకువచ్చారు.

ఈ ఏడాది "స్త్రీ శక్తి" అనే ప్రధాన థీమ్‌తో మహానాడు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళా సాధికారత, రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం, అభివృద్ధిలో మహిళల పాత్ర వంటి అంశాలపై చర్చలు సాగుతున్నాయి. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి హైబ్రిడ్ విధానంలో ప్రత్యక్ష ప్రసారం జరుగుతుండగా, ప్రతి క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడి స్క్రీన్ల ద్వారా నాయకులు, కార్యకర్తలు మహానాడు కార్యక్రమాలను వీక్షించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, మండల స్థాయి ప్రతినిధులు, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మహానాడు వేడుకలు రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# వర్చువల్ విధానంలో మహానాడు

**ఇచ్ఛాపురం, మే 27 (వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రాలలో డిజిటల్(వర్చువల్) పద్ధతిలో మహానాడు ఏర్పాటు చేశారు. ఇచ్ఛాపురం మున్సిపాల్టీ పరిధి, మండలం రెండు క్లస్టర్ పరిధిలో ప్రారంభమైన మహానాడు విజయవంతంగా ప్రారంభమైంది. బుధవారం పట్టణ పార్టీ అధ్యక్షులు పత్రి తవిటయ్య ఆధ్వర్యంలో కృష్ణతేజ ఫంక్షన్ హాల్లో, మండలం క్లస్టర్ పరిదిలో తేలుకుంచి గ్రామంలో మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం, ఈదుపురంలో సెక్రటరీ దక్కత కామేష్ ఆధ్వర్యంలో మహానాడు కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరిగాయి. రెండు రోజుల మహానాడు కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ముందుగా పార్టీ వ్యవస్థాపకులు దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వల చేసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలు అర్పిం చారు.

అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. క్లస్టర్ పరిదిలోని బూత్ కన్వీనర్లు కమిటీ సభ్యులంతా విదిగా పసుపు చొక్కా దరించి గుర్తిం పు కార్డులతో సమావేశానికి హాజరయ్యారు. వచ్చిన వారంతా టీడీపీ యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకున్నారు. డి సి ఎమ్ ఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ పరిశీలకునిగా వ్యవరించారు. ఈకార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్ష కార్యదర్శులు పత్రి తవిటయ్య, లోపింటి పద్మనాభం, నందిగాం కోటి, దక్కత కామేష్, రాష్ట్ర రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ కొండా శంకర రేడ్డి, రాష్ట్ర కార్యదర్శి



సాలిన డిల్లీ, పట్టణ మాజీ అధ్యక్ష కార్యదర్శులు కాళ్ల దర్మారావు, నందికి జాని, తెలుగుయువత అధ్యక్షులు కాళ్ల జయదేవ్, మాజీ కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, ఆశి లీలారాణి, సీనియర్ నాయకులు మేరుగు సూర్యనారాయణ, ఊనా సంతోష్, కొరాయి దర్మరాజు,జన్నెల సంతోష్ కృష్ణయ్య రామారావు, నాగరాజు పాత్రో, గిరీష్ ,ఎస్ ఎన్ పాండా నర్తు అప్పారావు ధర్మరాజు, శ్రీను శంకర్ తారకేష్ శుభాస్ రాలో , దక్కత ఢిల్లీ రావు కో.కన్వీనర్ బోర రాజేంద్ర ప్రసాద్, ఎ. ఈశ్వరరావు, కె నరేంద్ర రెడ్డి,బోర యువరాజ్, కేత్రవాస్, ఎ.పురుషోత్తం,, దున్న లోకేష్, శివంగి గణపతి, దున్న కూర్మారావు, పి.పురుషోత్తం, బీమరాజు, పి.హేమరాజు, సోమయ్య, శంకర నారాయణ, సారధి, వాసు, బసంత, త్రినాథ బెహరా తదితరులు పాల్గొన్నారు.

# మందసలో అట్టహాసంగా 'మహానాడు'

### -ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిద్దాం

### -పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్నచౌదరి

**మందస, మే 27(వార్త):** మందస మండలంలోని మందసటౌన్ పరిధిలో తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మహానాడు' కార్యక్రమం అత్యంత ఘనంగా, పండగ వాతావరణంలో జరిగింది. మండలంలోని మూడు క్లస్టర్లను కలుపుకుంటూ, మూడు ప్రత్యేక మండపాలలో కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్నచౌదరి ముఖ్య అతిథిగా విచ్చేసి పర్యటించారు.

### ఘన నివాళులు - ఉత్తేజపరిచే నినాదాలు

కార్యక్రమంలో భాగంగా వెంకన్నచౌదరి స్వర్గీయ నందమూరి తారకరామారావు(ఎన్టీఆర్) చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా సభలో ఉన్న నాయకులు, కార్యకర్తలు జై ఎన్టీఆర్.. జోహార్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన ఎన్టీఆర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.



### కార్యకర్తల ఉత్సాహంపై హర్షం

మందసటౌన్‌లో మహానాడు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించడం పట్ల వెంకన్నచౌదరి ఆనందం వ్యక్తం చేశారు. మందసటౌన్ మొత్తం పసుపు మయమైంది. చక్కగా ఏర్పాట్లు చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే చాలా సంతోషంగా ఉందని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో మందస మండల ముఖ్య నాయకులు, పార్టీ ప్రతినిధులు, తెలుగు యువత నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని మహానాడును విజయవంతం చేశారు.

# కొత్తూరులో పండుగలా 'హైబ్రిడ్ మహానాడు

**కొత్తూరు, మే 27 (వార్త):** పాతపట్నం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ "వర్చువల్ హైబ్రిడ్ మహానాడు" వేడుకలు పండుగ వాతావరణంలో జరిగాయి. టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు కొత్తూరు మండలంలోని నియోజకవర్గ క్లస్టర్-10 పరిధిలో ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అగతముడి అరుణ్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుండి పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పాతపట్నం మండల అధ్యక్షులు అగతముడి మాధవరావు పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించగా, అనంతరం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులర్పించారు. వర్చువల్ విధానంలో జరిగిన ఈ మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన దిశా నిర్దేశం కార్యకర్తల్లో కొత్త జోష్ నింపింది. పార్టీ సిద్ధాంతాలు, రాష్ట్ర ప్రగతి ప్రణాళికలు, క్షేత్రస్థాయిలో కార్యకర్తల బాధ్యతలపై ఆయన చేసిన ప్రసంగాన్ని క్లస్టర్-10 పరిధిలోని బూత్, యూనిట్ స్థాయి ప్రతినిధులు డిజిటల్ స్క్రీన్ల ద్వారా ఆసక్తిగా వీక్షించారు. చంద్రబాబు ప్రసంగం అంతటా చప్పట్లు, నినాదాలతో హాల్ మారుమోగింది. ఈ సందర్భంగా మహానాడుకు తరలివచ్చిన నాయకులకు, కార్యకర్తలకు మరియు అభిమానులకు మధ్యాహ్నం ప్రత్యేకంగా విందు భోజనాలు ఏర్పాటు చేశారు. భోజన విరామం అనంతరం కూడా కార్యకర్తలు అదే ఉత్సాహంతో తిరిగి ఆన్‌లైన్ ద్వారా మహానాడు డిజిటల్ సెషన్లలో పాల్గొన్నారు. కార్యక్రమం అత్యంత క్రమశిక్షణతో, విజయవంతంగా ముగియడం పట్ల పార్టీ ముఖ్య నాయకులు అగతముడి అరుణ్ కుమార్, అగతముడి మాధవరావు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, మహానాడు జయప్రదానికి తరలివచ్చి సహకరించిన ప్రతి ఒక్క కార్యకర్తకు, అభిమానికి వారు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ పరిధిలోని ముఖ్య నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు, తెలుగు తమ్ముళ్లు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



**ఇచ్ఛాపురం, మే 27(వార్త):** స్వేచ్ఛ వతి ప్రైవేట్ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్స్ యూనియన్ కి సంబంధించి గతంలో నందమూరి తారక రామారావు సీఎంగా ఉండేటప్పుడు ఇల్లు స్థలాలు కేటాయించి స్థలాన్ని చూపించి మా యూనియన్ కి సహకరిస్తామంటూ చెబుతూ పట్టాలు అందించారని చెప్పారు. వైఎస్ఆర్ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పరిపాలనలో సీఎంగా ఉండేటప్పుడు ఇచ్చిన స్థలాన్ని క్యాన్సిల్ చేసి పేదరికంలో ఉన్న యూనియన్ సభ్యులకు ఇల్లు స్థలాలు లేక కట్టుకోవడానికి గూడు లేక బాధపడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఎన్నో ప్రభుత్వాలు మారినా తలరాతలు మారలేదని,ఇప్పుడు వచ్చిన కూటమి ప్రభుత్వానికి మళ్లీ బాధనే తెలియపరుస్తూ యూనియన్ కి ఇల్లు స్థలాల కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నామని చెప్పారు. ఇల్లు స్థలాలు లేక ఒక ఇంట్లో ఫ్యామిలీలు ఉండలేక అద్దె ఇంట్లో తిరుగుతూ చాలావరకు బాధపడుతున్నామని, యూనియన్ సభ్యులకు గుర్తిస్తూ యూనియన్ సభ్యులసమస్యలు పై స్పందించి యూనియన్ సభ్యులకు న్యాయం చేయగలరని కోరుకుంటునట్లు తెలిపారు. యూనియన్ ప్రెసిడెంట్ రంగాల శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ధర్మ సాహు, సెక్రటరీ చిలకలపూడి కృష్ణారావు తదితరులు కోరారు. పెట్టిన దరఖాస్తు మున్సిపాలిటీ ప ద్వారా రావడం జరిగిందని సచివాల సిబ్బంది వీఆర్ వో జగదీష్ పరిశీలించారని చెప్పారు. దరఖాస్తుదారుడు కాసులు దేవి త్రినాద్ , గిలాయి భూషన్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు జరిగితే అధికారులకు తెలియపరచండి

### - ఎస్ఐ ఆర్.నరసింహమూర్తి

**పలాస, మే 27 (వార్త):** బాల్య వివాహాలు జరిగితే అధికారులకు సమాచారం అందించాలని కాశీబుగ్గ ఎస్ఐ ఆ నరసింహమూర్తి వెల్లడించారు. బుధవారం రాత్రి రామకృష్ణాపురం గ్రామ సందర్శన చేశారు. మండలంలోని రామకృష్ణాపురం గ్రామశీ సందర్శించి, గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి నారీ శక్తి గురించి, కొత్త చట్టాల గురించి వివరిస్తూ నారీ శక్తి అంటే మహిళల శక్తి, నాయకత్వం, ఆర్థిక స్వావలంబన, విద్య, నిర్ణయాధికారంలో వారి పాత్రను సూచించే భావన. భారతదేశంలో దీనికి చట్టపరమైన గుర్తింపుగా నారీ శక్తి వందన్ అధినియమ్ ద్వారా లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ లక్ష్యంగా పెట్టారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అవగాహన కల్పించి, గ్రామంలో దేవాలయాలు, మసీదులు, చర్చ్ లు ఏమైనా ఉంటే వాటికి సీసీ కెమెరాలు అమర్చమని, అదేవిధంగా గ్రామంలో ఏమైనా పండుగలు గాని, ఉత్సవాలుగాని జరిగినప్పుడు పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వమని తెలియజేశారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్, పేకాట, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా, అమ్మకం గురించి అవగాహన కల్పించి, బాల్యవివాహాలు, మహిళలపై జరుగు నేరాలు, 112 కాల్ ఉపయాగం, మొదలైన వాటి గురించి అవగాహన కల్పించారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546